# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :284 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 22-01-2025 | పేజీలు:4 వెల: 2.00


### మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

## కాళేశ్వరం కమీషన్లు..అందరికీ ముడుపులు...




హైదరాబాద్, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ ఎంతవరకు వచ్చింది? భారీ అవకతవకలను కమిషన్ గుర్తించిందా? కాళేశ్వరం 'కమీషన్ల' ప్రాజెక్టుగా మారిపోయిందా? ప్రాథమికంగా జ్యుడీషియల్ కమిషన్ ఏయే అంశాలను నిర్ధారించింది? ఇంజనీర్ల నుంచి ప్రభుత్వ పెద్దల వరకు అందరూ కుమ్మక్కు అయ్యారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.బీఆర్ఎస్ కీలక నేతలకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు కనిపిస్తోంది. రేపో మాపో కమిషన్ వీరికి నోటీసులు ఇవ్వాలని ఆలోచన చేస్తోంది. వారికి వ్యతిరేకంగా బలమైన సాక్షాధారాలను సిద్ధం చేసింది. ఇప్పటివరకే సేకరించిన ఆధారాలతో మాజీలను విచారించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.కేవలం పైసలు కోసం నిబంధనలకు తిలోధకాలు ఇచ్చినట్టు అంచనాకు వచ్చింది. ముఖ్యంగా రూల్స్ బ్రేక్ చేసి మరీ, అప్పట్లో అధికారులు ఆనాటి ప్రభుత్వ పెద్దలకు అన్నివిధాలుగా సహకరించినట్టు గుర్తించింది. ఈ ప్రాజెక్టుపై కాగ్ లేవనెత్తిన అంశాలు, విజిలెన్స్ రిపోర్టు, అఫిడవిట్లు వంటి నివేదికలను జ్యుడీషియల్ కమిషన్ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.ఇప్పటివరకు బ్యారేజీలు, పంప్ హౌస్‌ల నిర్మాణం, సివిల్ వర్క్స్ వరకు పరిమితమైన అవినీతి, చివరకు విదేశాల నుంచి తెచ్చిన మోటార్ల కొనుగోలులో భారీగా అవకతవకలు జరిగినట్టు గుర్తించింది కమిషన్. కాళేశ్వరంపై విచారణ చేపట్టిన పీసీ ఘోష్ కమిషన్, ఆసక్తికర విషయాలు బయటకు తీసినట్టు సమాచారం.కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టుగా మారిపోయినట్టు తెలుస్తోంది. కింది నుంచి పైస్థాయి వరకు ఏజెన్సీలు ముడుపులు ముట్ట జెప్పినట్టు ప్రభుత్వ వర్గాల మాట. ఈ క్రమంలో ప్రాజెక్టు అంచనాలను అమాంతంగా పెంచేశారు. ప్రాథమికంగా కొన్ని అంశాలను జ్యుడీషియల్ కమిషన్ నిర్ధారించినట్టు అంతర్గత సమాచారం. 204 పేజీలతో ప్రాథమిక రిపోర్టు ఘోష్ కమిషన్ రెడీ చేసింది. మార్చిలోగా తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనుంది.మంగళవారం నుంచి కాళేశ్వరం కమిషన్ మళ్లీ ఓపెన్ కోర్టు నిర్వహించనుంది. అప్పటి ఫైనాన్స్ స్పెషల్ సీఎస్, ఇతర ఆర్థిక శాఖ అధికారులను మళ్లీ ప్రశ్నించనుంది. ఎందుకంటే గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాల సమీకరణ కోసం అనుమతుల జారీలో ఆర్థికశాఖ కీలకపాత్ర పోషించింది. కార్పొరేషన్‌కు లేని ఆదాయాన్ని ఉన్నట్లు చూపించి రుణాలు సేకరించినట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో అధికారులతోపాటు అప్పటి బీఆర్ఎస్ నేత ప్రకాష్ తోపాటు బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను రెండురోజుల్లో విచారించనుంది. మొత్తానికి కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పార్టీ కొంప కొల్లేరు చేయడం ఖాయమనే వాదన అప్పుడే నేతల్లో బలంగా వినిపిస్తోంది.

## ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం.. రేవంత్ సర్కార్ నిర్ణయం!



హైదరాబాద్, జనవరి 21: ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో కూటమి సర్కార్ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలతోపాటు జూనియర్ కాలేజీల్లో కూడా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఈ విధానం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కూడా అమలు చేయాలని రేవంత్ సర్కార్ యోచిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటర్ విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. అనంతరం ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించనుంది. దీనికి ప్రభుత్వ ఆమోదం లభిస్తే 2025-26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేయాలని భావిస్తున్నారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 425 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా వరకు జూనియర్ కాలేజీలన్నీ నియోజకవర్గ, మండల కేంద్రాల్లోనే ఉంటున్నాయి. దీంతో పలువురు విద్యార్థులు రోజూ దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. పొద్దున్నే భోజనం తెచ్చుకునే వీల్లేనివారు మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లిపోయి.. ఇక తిరిగి కళాశాలకు రావడం లేదు. దీంతో డ్రాపౌట్లు పెరిగిపోతున్నాయి. హాజరు కూడా భారీగా పడిపోతుంది. ఈ సమస్యల నివారణకు రేవంత్ సర్కార్ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఇక వారంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ పథకం అమలుకు ఏటా రూ.100 నుంచి 120 కోట్లు అవసరమవుతాయని అంచనా.కాగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలతోపాటు బీఈడీ, డీఈడీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువుతున్న 3.91 లక్షల మందికి మధ్యాహ్న భోజనం అమలు చేయాలని 2018లోనూ అప్పటి సర్కార్ భావించింది. అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పథకం అమలుకు రంగం సిద్ధం చేశారు. అయితే ఆగస్టు 15న పథకాన్ని ప్రారంభించాలని భావించినా అమలుకు నోచుకోలేదు. మళ్లీ 2020 జులై 17న కూడా మరోమారు ప్రయత్నం జరిగింది. కానీ ఇదీ ఫలించలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ఈ పథకాన్ని అమలు చేయాలని మూడోసారి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదైనా పట్టాలెక్కుతుందేమో వేచి చూడాలి.

## అధ్యక్షుడిగా ట్రంప్ సంచలన ప్రకటన



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తొలి ప్రసంగంలో సంచలన ప్రకటన చేశారు. అమెరికా దక్షిణ సరిహద్దులో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. "దక్షిణ సరిహద్దుల్లో మరిన్ని బలగాలను మోహరిస్తాం..అక్రమ వలసదారులను వెనక్కి పంపిస్తాం.. విదేశీ ఉగ్రవాద సంస్థలపై ఉక్కుపాదం మోపుతాం" అంటూ ట్రంప్ ఆదేశాలు ఇచ్చారు."వెంటనే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి నా మంత్రివర్గం పని చేస్తుంది. ధరలను తగ్గిస్తాం.. ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్‌ఫాక్చరింగ్ దేశంగా అమెరికా అవతరిస్తుంది. ప్రపంచంలో అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా అమెరికా.. ఆటో మొబైల్ రంగాన్ని అనూహ్య రీతిలో ముందుకు తీసుకెళ్తాం. పౌరులు తమకు నచ్చిన మోడల్ వాహనాన్ని కొనుక్కునేలా చేస్తాం. ఎలక్ట్రిక్ వాహనాలను అధికంగా ఉత్పత్తి చేస్తాం. న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేసేలా చూస్తాం.. రాజకీయ కక్ష సాధింపులకు ఆస్కారం ఇవ్వం" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు."ఇకపై శత్రువులపై పోరాటమే అమెరికా దళాలకు ఏకైక లక్ష్యం.. ప్రభుత్వంలోని అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని తయారు చేస్తాం. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తాం. ప్రపంచంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తాం. మా ప్రభుత్వ ఏర్పాటుకు ఒక రోజు ముందే ఇజ్రాయెల్ బందీలు ఇంటికి చేరుకున్నారు. గాజా బందీలు ఇంటికి చేరుకోవడం సంతోషం. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తాం." అని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు."అమెరికా ఫస్ట్ అనేది మా నినాదం.. నా ప్రమాణ స్వీకారానికి వచ్చిన అతిథులందరికీ కృతజ్ఞతలు. చిన్న సమస్యలను కూడా పరిష్కరించే స్థితిలో మన ప్రభుత్వం ఉంది. సరిహద్దుల్లో నేరస్తులు పెట్రేగిపోతున్నారు.. అమెరికా అనేక ఆటుపోట్లు తట్టుకుని నిలబడింది" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు."తుఫాన్లు అమెరికాను అతలాకుతలం చేశాయి. అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డాం. విద్య, ప్రజావైద్యం మరింత మెరుగుపరచాల్సి ఉంది. న్యాయవ్యవస్థను పటిష్టం చేస్తాం. అమెరికా ప్రజలకు నేడు స్వాతంత్రత్య దినం. దేశ సరిహద్దుల రక్షణ మనకు ముఖ్యం.. శాంతిభద్రతల విషయంలో మరింత కఠినతరంగా ఉండాలి. అమెరికా పేరు ప్రఖ్యాతులు నిలబెట్టేందుకు ప్రజలు ముందుకు రావాలి.. దేవుడి దయతో తుపాకీ కాల్పుల నుంచి తృటిలో బయటపడ్డా. 2025 మనకు స్వేచ్ఛాయుత ఇయర్." అని డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు.

## దిల్ రాజు ఇంట్లో ఐటీ సోదాలు.. ఇళ్లు, ఆఫీసుల్లో ఐటి అధికారుల సోదాలు



హైదరాబాద్,టాలీవుడ్ ప్రొడ్యూసర్ దిల్ రాజు(వెంకటరమణ రెడ్డి) ఇంట్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని దిల్ రాజు ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దిల్ రాజు ఇంటితో పాటు నగరంలో పలుచోట్ల ఐటీ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు నగరవ్యాప్తంగా 65 బృందాలుగా దిల్ రాజుకు సంబందించిన ఎనిమిది ప్లేసుల్లో IT సోదాలు జరుగుతున్నాయి. నిర్మాత దిల్ రాజు, కుటుంబసభ్యుల ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు అన్నింటిని అధికారులు సోదా చేస్తున్నారు. రీసెంట్ గా దిల్ రాజు రెండు సినిమాలను నిర్మించారు. శిరీష్ తో కలిసి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా గేమ్ ఛేంజర్, అలాగే వెంకటేష్ హీరోగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలను దిల్ రాజు నిర్మించారు. కాగా దిల్ రాజుతో పాటు శిరీష్ , దిల్ రాజు కూతురు హన్సిత రెడ్డి నివాసాలలో కూడా ఐటి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.టాలీవుడ్ లో బడా ప్రొడ్యూసర్ గా దిల్ రాజు రాణిస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్ నుంచి నిర్మాతగా ఎదిగారు దిల్ రాజు. దిల్ సినిమాతో ఆయన నిర్మాతగా మారడం అలాగే ఆ సినిమా మంచి విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారిపోయింది. ఓ వైపు నిర్మాతగా రాణిస్తూనే మరో వైపు డిస్ట్రిబ్యూటర్ గాను వ్యవహరిస్తున్నారు దిల్ రాజు. కాగా ఇటీవలే దిల్ రాజుని ప్రభుత్వం తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ)కు చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. దిల్ రాజుతో పాటు మైత్రీ సంస్థ మీద కూడా ఐటి దాడులు జరుగుతున్నాయి. మైత్రీ నవీన్, సిఇఒ చెర్రీ, ఇంకా సంస్థ సంబంధీకుల అందరి ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారు అధికారులు.

## తెలంగాణ సంస్కృతి కట్టిపడేసింది..



హైదరాబాద్, తెలంగాణ సంసృతి, సంప్రదాయాలు తనను కట్టిపడేశాయని, సాంసృతిక వారసత్వాన్ని కొనసాగించడంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉన్నదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. ముంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన ఆయనకు సోమవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులంతా వీడ్కోలు పలికారు. మొదటి కోర్టు హాలులో జరిగిన జస్టిస్ అరాధే ప్రసంగిస్తూ.. అత్యున్నతమైన తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించా రు. హైకోర్టులో మహిళా న్యాయమూర్తులు అధిక సంఖ్యలో ఉండటం మంచి పరిణామమని చెప్పారు. హైకోర్టు కార్యకలాపాల నిర్వహణ, కేసుల విచారణలో తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.కాబోయే యాక్టింగ్ చీఫ్ జస్టిస్, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ మాట్లాడుతూ.. జస్టిస్ అరా ధే సేవలు ఎనలేనివని కొనియాడారు. కొవిడ్ సంక్షోభ సమయంలో కేసుల విచారణ కోసం మొదలు పెట్టిన ఆన్‌లైన్ విధానాన్ని తర్వాత కూడా కొనసాగించారని, రాష్ట్రంలోని కోర్టులను డిజిటలైజ్ చేయడంలో కీలక పాత్ర పోషించారని, లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారని శ్లాఘించారు. కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ బీ నరసింహశర్మ, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జీ ప్రవీణ్ కుమార్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ అలోక్ అరాధేని ఘనంగా సత్కరించారు.

## సంజయ్ రాయ్‌కు ఉరిశిక్ష ఇందుకే విధించలేదా..?




న్యూఢిల్లీ,కోల్‌కతా ట్రైనీ డాక్టర్ రేప్ అండ్ మర్డర్ కేసులో సిల్దా కోర్టు జడ్జ్ జడ్జి అనిర్బన్ దాస్ సంచలన తీర్పు ఇచ్చారు. సోమవారం దోషికి జీవిత ఖైదు విధించారు. ఉరిశిక్ష విధించాలని సీబీఐ కోరింది. అది అరుదైన నేరం కాదని జస్టిస్ తెలిపారు. మనిషిని చంపితే అది నేరం కాదా..? అత్యాచారం చేస్తే తప్పుకాదా..? తప్పే కానీ.. ఉరిశిక్ష మాత్రం వేయలేమని సీల్దా కోర్టు, అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ చెప్పారు. ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్‌లో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నేరస్థుడు సంజయ్ రాయ్‌కు ఉరిశిక్ష విధించాలని ఈ కేసు విచారణ చేసిన సీబీఐ న్యాయమూర్తిని కోరింది. అయితే అందుకు జస్టిస్ అనిర్బన్ దాస్ అరుదైన (రేరెస్ట్ ఆఫ్ రేర్) కేసుల్లో ఒకటి కాదని చెప్పారు. అసలు రేరెస్ట్ ఆఫ్ రేర్ కేసు అంటే ఏంటి?దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నేరస్తుడికి మరణశిక్ష పడుతుందని అందరూ అనుకున్నారు. కానీ.. విచిత్రంగా సీల్దా కోర్టు 2025 జనవరి 20న సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పుపై వెస్ట్ బెంగాల్‌లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 ఆగస్టులో కోల్‌కతా ఆర్జీ కార్ మెడికల్ కాలేజీలో సంజయ్ రాయ్ అనే పోలీస్ వాలెంటీర్ ఓ ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి, గొంతు నులిపి చంపేశాడు. ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేష్ విచారించింది. నేరం క్రూరంగా, దోషపూరితంగా ఉంటేనే ట్రయల్ కోర్టుకు ఉరిశిక్ష విధించే అధికారం ఉంది. ఆ నేరం అరుదైనదిగా ఉందని హైకోర్టు నిర్ధారించాలి. నేరస్తుడు చేసింది పెద్ద తప్పు, క్రూరత్వం ఉండాలని ప్రమాణాలు ఉన్నాయి. అసాధరణ నేరం అయ్యింటేనే మరణ శిక్ష విధిస్తారని కోర్టులు చెబుతున్నాయి. చేసిన తప్పు బహిరంగ అసహ్యం, అతని శిక్ష కోసం సమాజం డిమాండ్ చేయాలి. 2008లో కసబ్ ఉగ్రదాడి, 2012లో నిర్భయ కేసు, తాజాగా కేరళలో ఓ యువతి ప్రియుడిని చంపిన కేసులో ఉరిశిక్ష విధించారు. అయితే ఇవన్నీ అరుదైన నేరులు.దేశ ఆర్థిక రాజధాని ముంబైపై తుపాకులతో దాడి చేసి పెద్ద ఎత్తున మారణహోమానికి సూత్రధారి కసబ్‌కు ముంబై ప్రత్యేక కోర్టు 2010లో ఉరిశిక్ష ఖరారు చేసింది. ముంబైలో జరిపిన కాల్పుల్లో దాదాపు 160 మంది పౌరులు కన్నుమూశారు. మరో 300 మంది గాయపడ్డారు. ఉగ్రవాదులపై జరిగిన ఆపరేషన్‌లో ముంబై పోలీసులు, ఎన్ఎస్జి, ఎస్‌పిజిలకు చెందిన 10 మందికి పైగా సైనికులు మరణించారు. ఎరవాడ జైలులో లష్కరే తోయిబా కసబ్‌ను ఉరితీసింది. ఈ కేసులో మరో నలుగురికి జీవిత ఖైదు విధించింది. 2012 డిసెంబర్ 16న దక్షిణ ఢిల్లీలో కదులుతున్న బస్సులో 23 ఏళ్ల ఫిజియోథెరపీ ట్రైనీని ఆరుగురు వ్యక్తులు అత్యంత దారుణంగా అత్యాచారం చేసి బస్సు నుంచి బయటకు విసిరారు. ఆ యువతి డిసెంబర్ 29న సింగపూర్‌లోని మౌంట్ ఎలిజబెత్ ఆసుపత్రిలో మరణించింది. నిర్భయ రేప్ కేసు భారత దేశంలో సంచలనం రేపింది. 2020 జనవరి 22న నలుగురు దోషలకు కోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది. నిర్భయ కేసు అరుదైన కేసుగా కోర్టు తెలిపింది.2022 అక్టోబర్ 31న గ్రీష్మ అనే యువతి ఆమె ప్రియుడిని ఆయుర్వేద విషం ఇచ్చి చంపింది. బీఎస్సీ రేడియాలజీ స్టూడెంట్ అయిన షరోన్ రాజ్ కు కన్యాకుమారిలో ఓ ప్రైవేట్ కాలేజీలో చదువుకుంటోన్నప్పుడు అతనికి గ్రీష్మతో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి.. ఏడాది పాటు రిలేషన్‌షిప్‌లో కొనసాగారు. అయితే ఇంట్లో వాళ్లు గ్రీష్మకు వేరే సంబంధం చూడటంతో రిలేషన్ బ్రేకప్ చేయడానికి షరోన్ రాజ్ అంగీకరించలేదు. దీంతో అతన్ని చంపేందుకు గ్రీష్మ తన తల్లి, మేనమామ, తల్లితో కలిసి ప్లాన్ చేసింది.షరోన్ రాజ్ ను ఇంటికి పిలిచి కూల్ డ్రింక్ లో పారాక్వాట్ డైక్లోరైడ్ అనే ఆయుర్వేద మందును ఇచ్చింది. ఇది తాగి షరోన్ మరణించాడు. ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా షరోన్ రాజ్ చనిపోయినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా.. గ్రీష్మ, నిర్మల్ కుమరన్ నాయర్, ఆమె తల్లి 2022 అక్టోబర్ 31వ తేదీ నేరం చేసినట్లుగా అంగీరించారు. తాజాగా కోర్టు తాజాగా గ్రీష్మకు మరణ శిక్షను ఖరారు చేసింది.

### గత 2 దశాబ్దాలుగా పెరుగుతున్న మరణశిక్షలు ...

దేశవ్యాప్తంగా 2023లో 120 మందికి మాత్రమే ఉరిశిక్ష విధించారు. గత 2 దశాంబ్దాలుగా మరణశిక్షలు పెరుగుతున్నాయిని న్యాయ నిపుణులు చెబుతున్నారు. 1980లో ఓ కేసు విషయంలో అరుదైన నేరాలకే ఉరిశిక్ష విధించాలని సుప్రీం కోర్టు ఈ సిద్ధాంతాన్ని తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (BNS) చట్టాన్ని ఇండియా ప్రవేశపెట్టింది.

## అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో బిగ్ ట్విస్ట్..




హైదరాబాద్,అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో పెద్ద ట్విస్ట్ చోటుచేసుకుంది. అమిత్ గ్యాంగ్ గానీ.. మనీష్ గ్యాంగ్ గానీ కాల్పులు జరిపి ఉంటారని పోలీసులు భావించగా ఇప్పుడు అది వారు కాదని పోలీసులు నిర్ధారించారు. బీహార్ పోలీసుల సమాచారం మేరకు తొలుత మనీష్ ముఠాగా నిర్ధారించి గాలింపు చర్యలు మొదలు పెట్టారు.అయితే విచారణలో భాగంగా బీహార్ పోలీసులు బీదర్ పోలీసుల సీసీటీవీ ఫుటేజీని మనీష్ తల్లిదండ్రులు, గ్రామస్తులకు చూపించగా.. ఆ ఫుటేజిలో ఉంది మనీష్ కాదని వారు చెప్పారు. దీంతో ఈ స్టోరీ మళ్లీ మొదటికి వచ్చింది. నిందితుల వివరాలు ఇంతవరకు తెలియకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.తెలంగాణ, కర్ణాటక, బీహార్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇంకా సోదాలు కొనసాగిస్తున్నారు. బీదర్ తో పాటు హైదరాబాద్ నగరంలోని అన్ని ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తులను గుర్తించే పనిలో ఉన్నారు.అయితే, పక్కా ప్లాన్ ప్రకారమే మొత్తం ఆపరేషన్ లో ఒక్కసారి కూడా మొబైల్ ఫోన్ వాడకుండా ఇద్దరు దుండగులు జాగ్రత్త పడ్డారు. బ్యాగులు, బట్టలు, హోటల్ బిల్లులు, ప్రయాణ టిక్కెట్లు దగ్గర నుంచి తినే తిండి వరకూ ప్రతి సందర్భంలోనూ ఆన్‌లైన్ లావాదేవీలు లేకుండా నగదు మాత్రమే వినియోగించారు. నిందితులు మొబైల్ ఫోన్ కూడా వినియోగించకపోవడం కూడా విచారణలో పోలీసులకు ఇబ్బందిగా మారింది.

### ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ...

హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి హైడ్రా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలో ఇవాళ ప్రజావాణి కార్యక్రమంలో పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ బాధితుల నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని హైడ్రా కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# సభాపతిపై అవిశ్వాసానికి కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు

బెంగళూరు, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టిపై వేటు వేయాలని అధికార కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు ప్రారంభించింది. బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాల వేళ చివరిరోజున మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, బీజేపీ సభ్యుడు సీటీ రవిల మధ్య తలెత్తిన వివాదంలో సభాపతి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు మండిపడుతున్నాయి. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల ఎమ్మెల్సీ సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలు చేశారని పోరెన్సిక్‌లో రుజువైనట్టు ప్రచారం సాగుతోంది. అయితే సభాపతి మాత్రం అటువంటి వ్యాఖ్యలు రికార్డు కాలేదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సీఐడీ విచారణకు సభాపతి అనుమతులు ఇవ్వలేదు. ఈ కారణాలతోనే సభాపతిపై అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా ఆలోచన చేస్తున్నాయి. సుదీర్ఘకాలంలో జేడీఎస్?లో కొనసాగిన హొరట్టి ఇటీవలి ఎన్నికల్లో బీజేపీలో చేరి సభాపతి అయ్యారు. ఆయన పరిషత్‌లో సీనియర్ సభ్యుడిగా ప్రత్యేకంగా గౌరవిస్తారు. కానీ బెళగావిలో వివాదం పట్ల ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. పరిషత్‌లో మొత్తం సభ్యులు 75మంది. 38మంది సభ్యుల మద్దతు ఉండేవారికి సభాపతి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి 33మంది ఉండగా, బీజేపీ నుంచి 29మంది జేడీఎస్ 8మంది ఉన్నారు. ఒకరు ఇండిపెండెంట్ సభ్యుడు కాగా సభాపతి ఒకరు. మూడుస్థానాలు ఖాళీగా ఉన్నాయి. సభాపతితో కలిపితే బీజేపీ-జేడీఎస కూటమికి 38మంది మద్దతు ఉంది. ఇండిపెండెంట్‌గా ఉండే లఖన్ జార్కిహొళి బీజేపీకి మద్దతు ఇస్తే ఎటువంటి ఢోకా ఉండదు. అయితే జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పదవీకాలం ఈనెల 27తో ముగియనుంది. ప్రస్తుతం ఖాళీగా ఉండే మూడుస్థానాలు కలిపి ఒకేసారి 4 స్థానాలకు ప్రభుత్వం నామినేట్ చేసుకుంటే కాంగ్రెస్ బలం 37కు పెరుగుతుంది. అప్పుడు ఇండిపెండెంట్ మద్దతు కూడా పొందితే 38మంది మద్దతుతో సభాపతిని మార్చే అవకాశం ఉంది.

# రహస్య అజెండా ఇదేనా?

అమరావతి,కూటమిలో కొత్త నినాదం వినిపిస్తోంది. ప్రధానంగా టీడీపీలో కొత్త రాగం ఎత్తుకున్నారు టీడీపీ శ్రేణులు. కొత్త రాగం వెనుక ఎన్నో కారణాలు ఉన్నాయని టాక్. ఓ వైపు ఏపీలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో రోజురోజుకు ప్రజాదరణ పొందుతున్నారు. అందుకే టీడీపీలో ఒక్కసారిగా ఆ డిమాండ్ వినిపిస్తోందని రాజకీయ విశ్లేషకుల అంచనా. పవన్ కు చెక్ పెట్టేందుకు ప్లాన్ అమలులో భాగంగా ఈ రకమైన డిమాండ్ వినిపిస్తుందని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మరి ఆ డిమాండ్ ఏమిటి? దాని వెనుక ఉన్న కథ ఏమిటో చూద్దాం.కూటమిలో టీడీపీ, జనసేన మైత్రి బంధం చూసి ఇరుపార్టీల నాయకులు మురిసిపోతుంటారు. ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా కల్పించి సీఎం చంద్రబాబు తన పెద్దరికాన్ని నిలబెట్టుకున్నారు. అంతేకాదు ఎప్పుడు వీరిద్దరు కలిసినా ఆ పలకరింపులు కూడ వేరు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చేందుకు పవన్ కళ్యాణ్ ఇచ్చిన సపోర్ట్ అంతా ఇంతా కాదన్నది ఎవరూ కాదనలేని విషయం. అందుకే సీఎం చంద్రబాబు కూడ పవన్ కు ఇచ్చే ప్రాధాన్యత కూడ అదే స్థాయిలో ఉంటుంది.అలాగే పవన్ కూడ సినిమా రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చినా అనతి కాలంలోనే రాజకీయాన్ని అర్థం చేసుకున్నారని చెప్పవచ్చు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడుతూ, నిరంతరం ప్రజలతో మమేకమవుతూ తన చరిష్మాను పవన్ పెంచుకున్నారు.తన ప్రసంగంలో కూడ గతానికి నేటికీ చాలా తేడా ఉందని కూడ జనసేన అభిమానుల అభిప్రాయం. ఇప్పటి వరకు ఏ మంత్రి కూడ పర్యటించని మన్యంలో పవన్ పర్యటన అయితే ఓ రేంజ్ లో పేరు తెచ్చిందని చెప్పవచ్చు. అంతేకాదు పర్యటనతో ఆగకుండ అక్కడ అభివృద్ధి పనులు కూడ అంతేస్థాయిలో సాగిస్తున్నారు పవన్. ఇలా పవన్ ఏది చేసినా ఆయన క్రేజ్ రోజురోజుకు ఆకాశాన్ని తాకుతూ ఉందన్నది విశ్లేషకుల అంచనా.ఇదే ఇప్పుడు టీడీపీలోని నాయకులకు రుచించడం లేదో ఏమో కానీ, ఉన్నట్లుండి మంత్రి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొన్న మహాసేన రాజేష్, నేడు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డిలు ఈ అంశాన్ని తెరమీదికి తెచ్చారు. శ్రీనివాస్ రెడ్డి అయితే ఏకంగా సీఎం చంద్రబాబు ముందే లోకేష్ అంశాన్ని లేవనెత్తారు. రోజురోజుకూ లోకేష్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలన్న డిమాండ్ అధికం అవుతుండగా, కూటమిలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.సీఎం చంద్రబాబు ఎన్నో సమీకరణాలు పరిశీలించి మంత్రి పదవి వరకే లోకేష్ ను స్థిరపరిచారని, ఎవరెన్ని చెప్పినా ఆ ప్రయత్నం జరిగేది లేదంటూ ప్రచారం సాగుతోంది. పవన్ కళ్యాణ్ బలోపేతం అవుతుండడంతోనే, లోకేష్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలన్న డిమాండ్ తెచ్చి సమాన హోదా కల్పించాలని టీడీపీ క్యాడర్ కోరుతున్నట్లు కూడ ఏపీలో మరో ప్రచారం ఊపందుకుంది. మరి టీడీపీ అధినాయకత్వం వీటికి ఫుల్ స్టాప్ పెట్టకపోతే కొత్త తలనొప్పులు వస్తాయని కుండబద్దలు కొట్టేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇంతకు ఏం జరుగుతుందో తెలియాలంటే, మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

## ఆప్‌తో పొత్తు అవసరం లేదు

న్యూఢిల్లీ,ఆమ్ ఆద్మీ పార్టీతో ఎలాంటి పొత్తు అవసరం లేదనేది తన వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత అవసరమైతే ఆప్‌కు కాంగ్రెస్ మద్దతిస్తుందా? అనే ప్రశ్నకు ఆయన స్పందించారు. 2013 ఎన్నికల్లో ఆప్‌కు మద్దతివ్వకూడదని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో అసలు కూటమే ఉండకూడదని నేను చెప్పాను. అది నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ, పార్టీ అధిష్ఠానం పొత్తుకు మొగ్గు చూపింది' అని అజయ్ మాకెన్ తెలిపారు. ఢిల్లీలోని కోట్లా రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీవ్రాల్‌ను 'జాతి వ్యతిరేకి' అని తాను గతంలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. భాజపా సాయంతోనే ఢిల్లీలో ఆప్ బలోపేతమవుతోందని విమర్శించారు. '2013లో ఆప్‌కి కాంగ్రెస్ మద్దతివ్వడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే పునరావృతమైంది. ఢిల్లీ ప్రజలు ఇబ్బంది పడితే.. భాజపాకి మేలు జరుగుతోంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం' అని మాకెన్ తెలిపారు. కాంగ్రెస్‌ను బలహీనపరిస్తే..భాజపాను ఎదుర్కోవడం ఏ పార్టీకైనా అసాధ్యమన్నారు. భాజపాకి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో ఆప్ విఫలమైందన్నారు. హరియాణా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఆప్, కాంగ్రెస్ తొలుత నిర్ణయించాయని, అయితే, కేజీవ్రాల్ జైలు నుంచి విడుదలైన తర్వాత మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లోనూ ఆప్ బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారని మాకెన్ గుర్తు చేశారు. హరియాణా ఎన్నికల విషయంలోనూ అదే జరిగిందని, కూటమి ఏర్పాటు కోసం చివరిదాకా చర్చలు జరిగాయని తెలిపారు. ఢిల్లీలో ఎప్పుడు ఆప్ విజయం సాధించినా.. ప్రతిపక్ష స్థానంలో భాజపాయే ఉంటోందని మాకెన్ అన్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో మొత్తం 7 లోక్‌సభ స్థానాల్లో భాజపా విజయం సాధించి.. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. దీని వెనుక ఆప్ హస్తం లేదా?అని ప్రశ్నించారు.

# కుంభమేళాలో టాప్ బిజినెస్ ఇదే.. లక్షల్లో లాభాలు..

ప్రయాగ్‌రాజ్:కుంభమేళాలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం. ఎందరో సత్పురుషులను ఒకే చోట దర్శించే భాగ్యం కలగడం కూడ పుణ్యఫలమే. ఈ నేపథ్యంలో 144 ఏళ్ల తర్వాత జరిగే కుంభమేళాలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నారు. అయితే ఇక్కడ జరిగే ఓ వ్యాపారం మాత్రం పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ అనే రేంజ్ లో సాగుతుందట. కుంభమేళాలో 40 కోట్ల మంది వరకు భక్తులు పాల్గొంటున్న నేపథ్యంలో, ఈ వ్యాపారం మాత్రం అక్కడ జోరుగా సాగుతుందని వ్యాపారులు తెగ ఆనంద పడిపోతున్నారు.ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ వద్ద కుంభమేళా జనవరి 13న ప్రారంభమైంది. వచ్చేనెల 26 మహా శివరాత్రి నాడు ముగుస్తుంది. ఇప్పటికే 6 రోజులు పూర్తి చేసుకున్న కుంభమేళాలో భక్తుల రాక రోజురోజుకు పెరుగుతోంది. ఎటు చూసినా భక్తుల సందడి కనిపిస్తోంది. ఎందరో నాగ సాధువులు, అఘోరాలు తమ ఆవాసాలలో ఉంటూ భక్తులను ఆశీర్వదిస్తున్నారు. కుంభమేళాకు వచ్చే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా యూపీ సర్కార్ అన్ని ఏర్పాట్లు చేసింది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు దేశ విదేశాల నుండి వస్తున్నారు. అయితే ఇక్కడ ఈ వ్యాపారం మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందట.ఇంతకు ఆ వ్యాపారం ఏమిటో తెలుసా.. వేప పుల్లల వ్యాపారం. పూర్వం వేప పుల్లలు దంతాలను శుభ్రపరచుకోవడం కోసం ఉపయోగిస్తారు. నేటికీ కొన్ని గ్రామాలలో ఇదే పరంపర సాగుతోంది. అయితే కుంభమేళాకు భారీగా భక్తులు వస్తున్న నేపథ్యంలో స్థానికులు, కొందరు భక్తులు వేప పుల్లల వ్యాపారం ప్రారంభించారు. ఒక కట్ట వేపపుల్లలు రూ. 10 వేలకు కొనుగోలు చేసి, సుమారు లక్ష వరకు ఆదాయం పొందుతున్నారట




వ్యాపారులు. 6 అడుగుల వేపపుల్ల రూ. 10 రూపాయలకు విక్రయిస్తున్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రతి భక్తుడు తప్పక దంత శుద్ధి పాటిస్తారు. అందుకే టూత్ పేస్ట్ కంటే వేప పుల్ల మేలని, ప్రకృతి వరప్రసాదిని వేపచెట్టు పుల్లలతో దంత శుద్ధి బహుబాగు అంటూ వ్యాపారులు కేకలు వేస్తూ మరీ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. భక్తులు కూడ వేపపుల్లలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, 45 రోజుల పాటు సాగే కుంభమేళా తమకు భక్తిపారవశ్యంతో పాటు ఉపాధి కూడ చూపిందని స్థానికులు, వేప పుల్లల వ్యాపారులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 40 కోట్ల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యాపారస్తుల సంఖ్య కూడ రోజురోజుకు అంతేస్థాయిలో పెరుగుతుందట. మరి కుంభమేళాలో పాల్గొన్నారా.. అక్కడ వేప పుల్లను ఎన్ని రూపాయలకు కొనుగోలు చేశారో కామెంట్ చేయండి!

# ఇకనైనా స్వేచ్ఛావాయువులు వీచాలి!



సెంట్రల్ డెస్క్:ఇజ్రాయెల్- హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో ఈ ఒప్పందం సాకారం కానున్నదనే నమ్మకం అందరిలోనూ కలుగుతోంది. వారం రోజుల క్రితం ఒప్పందం కుదిరిందనే వార్తలు వెలువడినా, కాలికి వేస్తే వేలికి, వేలికి వేస్తే కాలికి అన్న చందంలో మడత పేచీలు పెట్టడంలో సిద్ధహస్తుడిగా పేరుగాంచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మరిన్ని రాయితీలు పొందేందుకు వీలుగా ఒప్పందంలోని అంశాలనుంచి హమాస్ వెనక్కు తగ్గుతోందని, అందువల్ల ఒప్పందం ఇంకా పూర్తిస్థాయిలో కుదరలేదని ప్రకటించడంతో ఈ ఒప్పందం అమలుపై నీలినీడలు అలముకున్నాయి. తాజాగా ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో కాల్పుల విరమణకు ముందడుగు పడింది. ఇక పూర్తిస్థాయి మంత్రివర్గం, ఆ తర్వాత ఇజ్రాయెల్ సుప్రీం కోర్టు సరేనంటే ఒప్పందం గట్టెక్కినట్టే! మూడు దశలలో అమలు కానున్న కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా హమాస్ తమ చెరలో ఉన్న 33 మంది బందీలను విడుదల చేస్తే, ఇజ్రాయెల్ తమ జైళ్లలో బంధించిన పాలస్తీనియన్లలో కొందరిని వదిలిపెడుతుంది. రెండో దశలో గాజానుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగుతాయి. ఆపై మూడో దశలో భాగంగా ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో గాజా పునర్నిర్మాణ కార్యక్రమం మొదలవుతుంది. రెండో దశలో చేపట్టవలసిన కార్యాచరణపై రెండు వారాల్లో మరో దఫా చర్చలు మొదలవుతాయి. తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలోని అంశాలేవీ కొత్తవి కావు. ఇవే అంశాలపై గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌ను దారికి తెచ్చేందుకు ఖతార్, ఈజిప్టు, అమెరికా దేశాలు అనేక విఫల ప్రయత్నాలు చేశాయి. మరి, ఇప్పుడే ఇజ్రాయెల్ ఎందుకు సరేనన్నట్లు? అమెరికా అధ్యక్ష పీఠాన్ని రేపు అధిరోహించబోతున్న డొనాల్డ్ ట్రంప్ తాను పదవీ ప్రమాణం చేయడానికి ముందే యుద్ధం పరిసమాప్తి కావాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అటు మిత్రదేశమైన ఇజ్రాయెల్‌ను, ఇటు ఉగ్రవాద సంస్థ హమాస్ ను హెచ్చరించిన నేపథ్యంలో నెతన్యాహూ దిగివచ్చినట్లు తెలుస్తోంది. సంకీర్ణ ప్రభుత్వాధినేతగా ఆటుపోట్లను ఎదుర్కొంటున్న నెతన్యాహూకు ట్రంప్ అధికారంలోకి వస్తే పదవీగండం తప్పదని గ్రహించి ఉండవచ్చు. ఈ ముందుచూపే నెతన్యాహూను కాల్పుల విరమణవైపు మొగ్గేలా చేసిందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. గాజాలో చేయవలసిన విధ్వంసమంతా చేసేశాక, 46 వేల మందికి పైగా అమాయకుల ప్రాణాలు హరించాక ఇప్పుడు ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు దిగిరావడంవల్ల గాజావాసులకు ఏం ఒరిగినట్లు? అని ప్రశ్నించుకుంటే ఏడాదిన్నరగా బాంబుదాడుల మధ్య బితుకుబితుకుమంటూ గడిపిన ప్రజలు కనీసం బయటకు వచ్చి శిథిలమైన తమ నివాసాలను చూసుకోవచ్చు. ప్రాణాలు కోల్పోయిన తమవారికోసం స్వేచ్ఛగా ఓ కన్నీటిబొట్టు విడవవచ్చు. అంతకుమించి, ఆకలిదప్పులతో అలమటించిపోతున్న తమ పిల్లలకు కాస్త తిండిపెట్టి కడుపు నింపవచ్చు. తాజాగా అమలు కానున్న కాల్పుల విరమణ ఒప్పందం వల్ల గాజాకు ప్రతి రోజూ ఇకపై 600 ట్రక్కుల ఆహార పదార్థాలు, ఇతరత్రా సాయం అందుతాయి. ఈ యుద్ధం కారణంగా 20 లక్షల మంది గాజావాసులు స్వస్థలాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఇప్పుడు వారంతా మళ్లీ స్వస్థలాలకు చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇజ్రాయెల్ పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు దాడి జరిపి 1200 మంది ఇజ్రాయెలీలను బలిగొన్నారు. 250 మందిని బందీలుగా చేసుకున్నారు. దీంతో భగ్గుమన్న ఇజ్రాయెల్ సాగించిన ముప్పేట దాడి.. గాజావాసులకు తీరని దుఃఖాన్ని, జీవితాంతం వెంటాడే చేదు జ్ఞాపకాలనూ మిగిల్చింది. ఇప్పుడు వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అయినవాళ్లనూ, ఇల్లూవాకిళ్లనూ కోల్పోయి నడివీధిలో నిలబడిన గాజా ప్రజలను ఆదుకునేందుకు ప్రపంచదేశాలు ముందుకు రావలసిన సమయమిది. ఐక్యరాజ్యసమితితో చేతులు కలిపి, గాజా పునర్నిర్మాణానికి నడుం బిగించాలి. ఈ క్రమంలో గాజా పునర్నిర్మాణానికి 123 మిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రకటించిన ఐరోపా సమాఖ్యను అభినందించాలి. ఇదే విధంగా అన్ని దేశాలూ మానవతాసాయాన్ని ప్రకటించి, గాజాను ఒడ్డున పడేసేందుకు తమ వంతు కృషి చేయాలి. మరో రెండు వారాల్లో శాశ్వత కాల్పుల విరమణ కోసం మొదలు కానున్న చర్చలు సఫలీకృతం కావాలన్నది శాంతికాముకుల, మానవతావాదుల ఆశ, ఆకాంక్ష. అది నెరవేరాలని ఆశిద్దాం.

# శభాష్ ఇస్రో!

సెంట్రల్ డెస్క్:విఫలమైనా ప్రతీసారి ఆకలి చావులు ఆపలేని దేశానికి అంతరిక్ష ప్రయోగాలు అవసరమా? అంటూ దశాబ్దాలుగా ఎగతాళి చేస్తూనే వున్నారు? పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి ఎన్నో సమస్యలను స్వాతంత్ర్య భారతం నుంచి తరిమేయలేని వారికి జాబిల్లి పై విక్రమ్ జాడ అవసరమా? అంటూ వెనక్కి లాగుతూనే వున్నారు? అయినా%ౌ% బాధను దిగమింగి బాధ్యతగా పని చేస్తూ.. విఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు విక్రమ్ సారాబాయ్, హోమి జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం వంటి ఎంతోమంది మహానుభావుల స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రరాజ్యాలకు దీటుగా ఎదిగితేనే మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం అని నమ్మి ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, తదితర సిబ్బంది అహర్నిశలు గెలుపోటములకు అతీతంగా ప్రయోగాలతో యుద్ధం చేస్తూనే వున్నారు మన దేశాన్ని గెలిపించడానికి..! ఇప్పుడు ఇండియాకే కాదు.. యావత్ ప్రపంచానికి పాఠం చెబుతుంది ఇస్రో! 'ఆగని ప్రయత్నాల పరంపరే అంతరిక్షపు హద్దులను చెరిపేస్తుందని, అలుపెరగని కఠోర శ్రమతో కూడిన ఆత్మవిశ్వాసపు శోభకు అనంత విశ్వం తలొంచుతుందని,స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ విజయంతో ఇస్రో అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్‌ను నిలిపింది. భవిష్యత్‌లో స్పేస్ స్టేషన్, చంద్రయాన్- 4, గగనయాన్ తదితర ప్రాజెక్టుల విజయానికి నాంది పలికింది. డిసెంబర్ 30, 2024న చేపట్టిన స్పేడెక్స్ ప్రయోగం దశల వారీగా మన శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. కీలకమైన ఎస్‌డిఎక్స్ 01(ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02(టార్గెట్) ఉపగ్రహాలను అంతరిక్షంలో అనుసంధానం చేసే దశను మనం దాటేశాం. ఈ డాకింగ్ ప్రక్రియ కోసం సెన్సర్ల సాయంతో మూడుసార్లు ప్రయత్నించి, పరిస్థితులు అనుకూలించక చివరిలో విరమించుకోవాల్సి వచ్చింది. వృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూ గంటకు వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఉపగ్రహాలను వాటి వేగాన్ని నియంత్రిస్తూ, బాగా తగ్గించి, చివరికి 3 మీటర్ల దూరం వచ్చాక చాలా జాగ్రత్తగా డాకింగ్ ప్రక్రియ చేసి ఒకే యూనిట్‌గా మార్చడం చాలా కష్టం. అయినా మన శాస్త్రవేత్తలు గురువారం ఉదయం దాన్ని సాధించి చరిత్ర సృష్టించారు.ఇప్పుడు అనుసంధానమైన శాటిలైట్‌ల మధ్య విద్యుత్ ప్రసారం చేసి స్పేస్‌లో ఉపగ్రహాల మధ్య సర్వీసింగ్‌ను పరిశీలిస్తారు. ప్రయోగాలు పూర్తయ్యాక అన్ డాకింగ్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ రెండు ఉపగ్రహాలు రెండు సంవత్సరాల పాటు మనకు సేవలు అందించనున్నాయి. ఈ అసాధారణ విజయంతో మన అంతరిక్ష



ప్రయోగాల జోరు ప్రపంచ పత్రికల్లో ప్రముఖ వార్త అయ్యింది. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రూ. 3,984 కోట్లతో శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మించాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ఇప్పటికే విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి విజయవంతం గా ప్రవేశపెడుతూ అంతరిక్ష వ్యాపారంలో దూసుకుపోతున్న మనం త్వరలోనే ఇంకా మెరుగైన ప్రయోగ ఫలితాలతో దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఇస్రో వుంటుందని మనం గట్టిగా చెప్పవచ్చు.ఎక్కడ మొదలుపెట్టాం మనం. సైకిల్‌పై రాకెట్ల విడిభాగాలను మోసుకెళ్లాం. అంగారక గ్రహంపై జీవరాశి మనుగడను శోధిస్తున్నాం. తొలి ప్రయత్నంలో నిలబడలేని విక్రమ్ ల్యాండర్ అపజయంపై నాలుగు సంవత్సరాలు పెద్ద యుద్ధం చేసి పోగొట్టుకున్నచోటే నిలబడి చంద్రుని ఉపరితలంపై విక్రమ్ సాక్షిగా ప్రజ్ఞాన్ రోవర్‌తో అడుగులు వేయించాం. శుక్రయాన్‌కు సిద్ధమవుతున్నాం. అంతరిక్ష వ్యవసాయం కోసం అన్వేషిస్తున్నాం. మానవ సహిత రోదసీ యాత్రల కోసం ఉత్సాహంగా బయలుదేరుతున్నాం. కేవలం పాన్ ఇండియా స్థాయి సినిమాల బడ్జెట్‌తో మన మేధో అంతరిక్ష సినిమాలను ప్రపంచానికి చూపిస్తూ తగ్గేదేలే.. శభాష్ అనిపించుకుంటున్నాం. మన జాతీయ జెండాను సగర్వంగా అగ్రరాజ్యాలకు దీటుగా, స్ఫూర్తివంతంగా నిలుపుతున్నాం..! ఎలా మొదలుపెట్టాం అని కాదు! ఎంతలా ఎదిగాం అనేదే నేటి 'మ్యాటర్'. అదే భావి భారత తరాలకు న్యూ చాప్టర్. గమనమే నీ గమ్యమైతే బాటలోనే బ్రతుకు దొరుకు అన్నట్లు.. మన ఇస్రో ప్రయాణం, ప్రకాశం విశ్వరహస్యాల శోధనలో నిరంతరాయంగా విజయవంతంగా కొనసాగాలి.

# ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు

న్యూఢిల్లీ, వినీలాకాశంలో ఈ నెల 22న అద్భుత దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు వచ్చి కనువిందు చేయనున్నాయి. ఆయా గ్రహాలు ఎలాంటి బైనాక్యులర్ల సహాయం లేకుండానే నేరుగా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు గ్రహాలు ఒకో వరుసలోకి రాబోతున్నాయి. గ్రహాలు ఒకేవరుసలో చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహాలు ఒకే వరుసలోకి రావడాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఒకే వరుసలోకి రానున్నాయి. చాలా అరుదుగా గ్రహాలన్నీ ఒకే వరుసలోకి వస్తుంటాయి. ఈ దృగ్విషయాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్, పరేడ్ ఆఫ్ ప్లానెట్స్‌గా పిలుస్తుంటారు. వాస్తవానికి గ్రహాలకు మధ్య భారీగానే దూరం ఉంటాయి. గ్రహాలు ఏవీ అంతరిక్షంలో వరుస క్రమంలో ఉండవు. కానీ, మనకు భూమిపై నుంచి చూసిన సమయంలో ఒకే వరుసలో దర్శనమిస్తాయి. ఈ దృశ్యాన్ని బైనాక్యులర్స్ ద్వారా చూస్తే మాత్రం మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్‌లను చూసేందుకు ఫిబ్రవరి ప్రారంభం ఉత్తమమైన సమయంగా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. ఇక మార్చిలో అరుణగ్రహం, బృహస్పతి, యురేనస్, వీనస్, నెప్ట్యూన్, శని, మెర్క్యురీ గ్రహాలు ఒకేవరుసలోకి వచ్చి కనువిందు చేయనున్నాయి. దీన్ని గ్రేట్ ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా పిలుస్తారు. ఈ ఖగోళవిందును టెలిస్కోప్ సహాయం లేకుండా చూడొచ్చు. కానీ, స్పష్టంగా నాలుగు గ్రహాలు మాత్రమే కనిపిస్తాయి. నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు టెలిస్కోప్ అవసరమవుతుంది. సూర్యాస్తమయం తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ సమయంలోనే అన్ని గ్రహాలు ఒకేవరుసలో దర్శనమిస్తాయి. రాత్రి 11.30 గంటల తర్వాత మళ్లీ కనిపించవు. కానీ, బృహస్పతి, మార్స్, యురేనస్ గ్రహాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మళ్లీ కనిపించకుండా పోతాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ఆయా గ్రహాలను భూమిపై నుంచి నేరుగా చూడొచ్చు. శని, బుధుడు, నెప్ట్యూన్ సూర్యాస్తమయం సమయంలో సూర్యుడికి దగ్గరగా వెళ్తాయి. మెర్క్యురీ, శని, నెప్ట్యూన్ సూర్యుడికి చాలా దగ్గరగా వెళ్లడంతో గ్రహాలు భూమిపైకి కనిపించడం తగ్గిపోతుంది. శుక్ర గ్రహం సైతం అంతగా కనిపించేందుకు ఛాన్స్ ఉండదు. బృహస్పతి, అంగారకుడు, యురేనస్ సైతం మాత్రమే కొద్దివారాల పాటు అలాగే ఉంటాయి.

# నేను పోట్లాడుతా..

హైదరాబాద్,వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరు సొంత పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది.. సంబంధం ఉన్నా లేకపోయినా ప్రతి ఇష్యూలో వేలు పెట్టడం అతనికి అలవాటుగా మారిపోయింది.. ఎవరి అండదండలు చూసుకుని కౌశిక్ రెడ్డి అంతా దూకుడుగా వెళ్లుతున్నారన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతుంది%ౌ% మొదటి సారి ఎమ్మెల్యే అయిన కౌశిక్ తన ఇమేజ్ పెంచుకోవడానికి అలా వ్యవహారిస్తున్నాడా..? ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని వీడిబీఆర్ఎస్‌లోకి వచ్చిన కౌశిక్ రెడ్డి.పార్టీలో తన ఉనికిని చాటుకోవడాకే ఇలా చేస్తున్నారా..? పార్టీ పెద్దలకు తెలిసే ఇదంతా జరుగుతుందా?హుజురాబాద్ నుంచి శాసనసభకు మొదటి సారి ఎన్నికైన పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచేందుకు సెంటిమెంటునే నమ్ముకోవాల్సి వచ్చింది. సెంటిమెంట్ అంటే ఇంకేదో అనుకునేరు.. అంత సీన్ లేదు లేండి.. గెలిస్తే మంత్రి అవుతానన్న ఆశతో.. గెలిపించకపోతే చావే శరణ్యమని ప్రజల్ని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి ఎలాగోలా గట్టెక్కారాయన. అలాంటి సెంటిమెంట్ డైలాగులు పండించి త్రిముఖపోటీలో విజయం సాధించారు. అయితే అతను గెలిచాడు కాని బీఆర్ఎస్ ఓటమి పాలవ్వడంతో ఆయన అమాత్యపదవి పదవి ఆశలు ఆవిరయ్యాయి. ఈటల రాజేందర్ గులాబీ పార్టీలో ఉన్నప్పుడు ఆయనపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కౌశిక్‌రెడ్డి గత ఎన్నికల్లో టికెట్ కోసం గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయన నోటి దూకుడు పుణ్యాన ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లోకి వద్దామన్నా డోర్లు తెరుచుకునే పరిస్థితి లేకండా పోయింది .. ఫస్ట్ టైం ఎమ్మెల్యే అయిన కౌశిక్ రెడ్డి తన ఉనికి చాటుకోవడానికి ప్రదర్శిస్తున్న దూకుడు%ౌ% చేస్తున్న ఓవర్ యాక్షన్ ఎప్పటికప్పుడు ఆయన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేస్తున్నాయంటునారు .. ఆ దుందుడుకు వ్యవహారం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద సమస్యగా మారిందని గులాబీ శ్రేణులే అంటున్నాయి.చిన్న చిన్న విషయాలకు కూడా గొడవలకు వెళ్లడం.. తనకు సంబంధం లేని అంశాల్లో వేలు పెట్టి సవాళ్లు విసరడం %ౌ% మీసాలు తిప్పడం, తొడలు కొట్టడం లాంటి వాటితో కౌశిక్‌రెడ్డి తాను ఎమ్మెల్యేనన్న విషయం మర్చిపోతున్నారని బీఆర్ఎస్ నేతలు సైతం అసంతృప్తిగా ఉన్నారట.. సొంత పార్టీ నేతల్లో తనపై నెగిటివ్ పెరుగుతున్నా ..కౌశిక్ రెడ్డి మాత్రం నేనింతే అన్నట్లు .. తాను ఎమ్మెల్యే అనే విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తూ పార్టీకి ఉన్న కాస్త పరువుని తీసేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక ఎమ్మెల్యే వ్యవహరించాల్సినట్లు ఆయన ప్రవర్తన ఉండట్లేదని సొంత నియోజకవర్గ ప్రజలే అభిప్రాయ పడుతున్నారు.తాజాగా కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్‌పై కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరు తీవ్ర దుమారంగా మారింది%ౌ% జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరైన ఆ సమావేశంలో బజారు రౌడీలా వ్యవహరించిన కౌశిక్‌రెడ్డిని పోలీసులు కలెక్టరేట్ నుంచి బయటకు లాక్కెల్లాల్సి వచ్చింది %ౌ% జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన కౌశిక్‌రెడ్డిపై మూడు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ ఏదో ఒక వివాదం రేగుతోందనే టాక్ బీఆర్ఎస్ వర్గాల్లోనే వినిస్తుంది. అది పోలీస్ స్టేషన్ కావచ్చు, జిల్లా సమీక్ష సమావేశం మందిరం కావచ్చు, ప్రెస్ మీట్ కావచ్చు, అసెంబ్లీలో ఇలా ప్లేస్ ఏదైనా ఆయన వీధి గూండాలా వ్యవహరిస్తున్న తీరు బీఆర్ఎస్ నేతల్లో హాట్ టాపిక్ మారింది .. తనకంటే సీనియర్ నేతలు . రెండు, మూడుసార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కౌశిక్ రెడ్డి వాడుతున్న బాష, పదజాలానికి సంబంధించి కూడా కారు పార్టీ నేతలు సైతం పెదవి విరుస్తున్నారట.. కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని బీఆర్ఎస్ నేతలు గుసగుసలాడుకుంటున్నారు..

## షేక్ హసీనా బయటపడ్డ ఘటనపై ఆడియో విడుదల

న్యూఢిల్లీ,బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన ఓ ఆడియో రిలీజైంది. గత ఏడాది ఆగస్టులో ఆమె ప్రాణభయంతో దేశ విడిచి పరారైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ ఆన్‌లైన్‌లో ఆమె ఆడియోను రిలీజ్ చేసింది. తన ప్రాణాలు కాపాడిన అల్లాకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. రాజకీయ ప్రత్యర్థులు తనను చంపేందుకు కుట్ర పన్నినట్లు ఆమె చెప్పింది. సోదరి రెహానాతో కలిసి ఆగస్టు 5వ తేదీన హసీనా ఢిల్లీకి చేరుకున్న విషయం తెలిసిందే. కేవలం 20 నుంచి 25 నిమిషాల తేడాలోనే ప్రాణాలను దక్కించుకున్నానని, ఆగస్టు 21న జరిగిన సజీవంగా ప్రాణాలతో బయటపడిన ఫీలింగ్ కలుగుతున్నట్లు ఆమె వీడియోలో తెలిపారు. కోటలిపారాలో బాంబు దాడి, ఆగస్టు 5, 2024 అటాక్ నుంచి అల్లా తనను కాపాడినట్లు ఆమె చెప్పారు. బంగ్లా భాషలో ఆమె ఆడియో ఉన్నది. 2004, ఆగస్టు 21వ తేదీన హసీనాపై గ్రేనేడ్ అటాక్ జరిగింది. అప్పుడు ఆమె గాయాలతో బటయపడ్డారు.

# మోడీకి మైనార్టీ...చంద్రబాబుకు మెజార్టీ



అమరావతి,ఎన్డిఎలో భాగస్వామ్యం కావడం, మోడీ అత్తెసరు సీట్లతో గెలవడం ఎపి సిఎం చంద్రబాబుకు కలసి వస్తోంది. అయితే కొంతమేర ఎపి లభాపడుతుందనే చెప్పాలి. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ విషయాల్లో ఎపి సిఎం చంద్రబాబు ఆచితూచి అడుగు వేయడం వల్ల కలసివస్తోంది. చంద్రబాబు అవసరం ఉంద ఇకనుక మోడీ కూడా కిక్కురుమనకుండా ఉంటున్నారు. లేకుంటే మోడీ తన విశ్వరూపం చూపేవారు. ఇలా అన్ని రాష్ట్రాలకు మోడీ చేయూతను ఇస్తే ఆయా రాష్ట్రాలు అభివృద్ధి చెందగలవు. ఇక్కడ ఆయన తనకు అవసరమున్న మిత్రులకు మాత్రమే అండగా ఉండాలను కోవడం వల్ల మిగతా రాష్ట్రాల్లో వ్యతిరేకత రాగలదు. అయితే కేంద్రంతో చేయి కలిపి నడవడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. తాజాగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి 11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు కూడా సజావుగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇటీవలే కేంద్ర బృందంకూడా ఇక్కడ పర్యటించి ప్రాజెక్టు వివరాలు సేకరించింది. మొత్తంగా ఈ మూడు అంశాలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉదారంగా వ్యవహరించారని చెప్పవచ్చు. కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం కావడం వల్ల మాత్రమే ఇది సాధ్యమయ్యిందని చెప్పాలి. లేకుంటే మోడీ ఈ మాత్రం కూడా చేసేవారు కాదు. విశాకను తెగనమ్మడానికి నిర్ణయించుకున్నా ..అనివార్యంగా ప్యాకేజీ ప్రకటించక తప్పలేదు. తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చంద్రబాబు చాణక్యం ప్రదర్శిస్తున్నారు. గతంలో కేంద్రంతో విభేదించినందున ఏం జరిగిందో ఆయనకు తెలుసు. ఎన్డిఎతో విభేదించి బయటకు రావడం వల్ల ఎపిలో అధికారం పోయింది. తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చు కోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటిస్తూ..అనకువగా ఉంటున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత కూడా ఎపి పురోభివృద్ధికి తోడ్పడుతోంది. అందుకే ప్రైవేటీకరించాలనుకున్న విశాఖ ప్లాంట్ విసయంలో మోడీ మనసు మార్చుకున్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మోడీకి కూడా లాభించే విషయమే. రాజధాని అమరావతి నిర్మాణం కోసం కూడా కేంద్రం గత బడ్జెట్‌లో ఆర్థిక సాయం అందించింది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. మూడు రాజధానులు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన నష్టం కారణంగా ఎపి ఐదేళు వెనకబడి పోయింది. అమరావతిని జగన్ పూర్తి చేసివుంటే ఆ ఖ్యాతి ఆయనకే దక్కేది. రాజధానిపై విషం చిమ్మిన పాపానికి జగన్ భారీ మూల్యం చెల్లించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా రాజధాని లాంటి అద్భుత నగరం ఉండాల్సిందే. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది. మొత్తంగా విశాఖ పునరుద్దరణ జరిగి లాభాల్లో ప్లాంట్ నడిచేలా చేయగలగాలి. అలాగే ఈ నాలుగున్నరేళ్ల కాలంఓ అమరావతిని పూర్తి చేయాలి. పోలవరం కూడా ఇదే సమయంలో పూర్తి కాగలగాలి. గత 14 ఏళ్లచంద్రబాబు పాలనకన్నా, ఈ ఐదేళ్ల పాలనే బాబుకు పరీక్ష. ఇవన్నీ చేయగలిగితనే ప్రజలు నమ్ముతారు.

# డిప్యూటీ సీఎంగా లోకేశ.. లైన్ క్లియరైందా?



అమరావతి,తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ డిప్యూటీ సీఎంగా ప్రమోట్ కాబోతున్నారా? టీడీపీ శ్రేణుల నుంచి రోజురోజుకు తీవ్రమవుతున్న ఈ డిమాండ్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారా? కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం టీడీపీ కార్యకర్తల డిమాండ్ పై సానుకూలంగా ఉన్నారా? అంటే అవుననే సమాధానం ఏపీ రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీకి మూడో తరం వారసుడిగా.. రాబోయే కాలంలో పార్టీని నడిపించే నాయకుడిగా లోకేశ్ ఇప్పటికే పూర్తి స్థాయిలో తన సమర్ధతను చాటుకున్నారు. లోకేశ్ సారథ్యంలో టీడీపీకి బంగారు భవిష్యత్ ఉంటుందని ఆ పార్టీ క్యాడర్ బలంగా నమ్ముతోంది. దీనికి కారణం లోకేశ్ రాజకీయంగా ఎంతో పరిణితిని కనబర్చడమే. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలనకు ఎదురెళ్లి లోకేశ్ సవాల్ చేశారు. యువగళం పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లి వైసీపీ అధిష్టానానికి ముచ్చెమటలు పట్టించారు. లోకేశ్ దూకుడు కారణంగానే జగన్ అరాచక పాలనకు భయపడి మూడేళ్లు బయటకురాని తెలుగుదేశం నేతలు, కార్యకర్తలతోపాటు పలు వర్గాల ప్రజలు సైతం ఒక్కసారిగా రోడ్లెక్కి అప్పటి ప్రభుత్వంపై పోరు బాట పట్టారు. దీంతో జగన్ పతనానికి బీజం పడినట్లయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ప్రభుత్వంలో నారా లోకేశ్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. తన పరిధిలోఉన్న శాఖల్లో కీలక మార్పులు తీసుకువస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. తనదైన మార్క్ ను చూపిస్తున్నారు. అన్నివిధాలా లోకేశ్ తన సమర్ధతను నిరూపించుకోవటంతో తెలుగుదేశం శ్రేణులు డిప్యూటీ సీఎంగా లోకేశ్ ను ప్రమోట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీలోని కీలక నేతలు బహిరంగంగానే లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డితోపాటు డిప్యూటీ స్పీకర్ గా ఉన్న రఘురామ కృష్ణరాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇలా పలువురు నేతలు ఒక్కొక్కరుగా నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలని కోరుతున్నారు. ఇటీవల మైదుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీనులైన సభావేదికపైనే శ్రీనివాస్ రెడ్డి లోకేశ్ ను డిప్యూటీ సీఎంను చేయాలంటూ చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఇది నా ఒక్కడి అభిప్రాయం కాదు, తెలుగుదేశం క్యాడర్ అభిప్రాయం అని చెప్పారు. అయితే, చంద్రబాబు శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తిపై స్పందించలేదు. కానీ, తెలుగుదేశం ముఖ్యనేతలతో మాట్లాడుతున్న సందర్భంలో సమయం వచ్చినప్పుడు కూటమి నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు చెప్పినట్లు పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదుగురు ఉపముఖ్యమంత్రులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు. డిప్యూటీ సీఎం అనేది రాజ్యాంగబద్ధమైన పదవి కాదు.. అదో రాజకీయ పదవి అని చెప్పవచ్చు. ఎందుకంటే రాజ్యాంగంలో డిప్యూటీ సీఎం అనే పదవి గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. అయితే, దాదాపు అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాల్లో డిప్యూటీ సీఎంలు ఒకరు, అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. ఉపముఖ్యమంత్రి అంటే రాజ్యాంగబద్ధమైన పదవికాకపోయిన ఆ స్థానంలో ఉన్నవారు ముఖ్యమంత్రి తరువాత ముఖ్యమంత్రిగా రాజకీయ పార్టీలు, ప్రజలు భావిస్తారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తన శాఖలపై సమీక్షలు చేస్తూనే.. ఇతర శాఖలపై సమీక్షలు చేసే అవకాశం కూడా ఉంటుంది. మంత్రుల కంటే డిప్యూటీ సీఎంకు పవర్స్ ఎక్కువ అనే చెప్పొచ్చు. దీంతో కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన తెలుగుదేశం నుంచి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ గట్టిగా వస్తోంది. మంత్రిగా ఉండటం వల్ల కేవలం కొంతమేర మాత్రమే లోకేశ్ ప్రభుత్వంలో భాగస్వామ్యం కాగలుగుతున్నారనీ, ఉపముఖ్యమంత్రి హోదా ఉంటే పాలనపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా లోకేష్ కు ప్రమోషన్ తెలుగుదేశం బలోపేతానికి సైతం దోహదపడుతుందని పార్టీ నేతలు సైతం చెబుతున్నారు. మంత్రి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలని తెలుగుదేశం నేతల నుంచి వ్యక్తమవుతున్న డిమాండ్ పట్ల జనసేన పార్టీ నేతలు మౌనంగానే ఉన్నారు. అయితే తెలుగుదేశం శ్రేణుల డిమాండ్ ను అవకాశంగా తీసుకొని కూటమిలో విబేధాలు తలెత్తేలా చేయాలని వైసీపీ సోషల్ మీడియా గట్టిగానే ప్రయత్నిస్తున్నది. జనసేన పార్టీ కార్యకర్తలమంటూ టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండటం విశేషం. అయితే, లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలన్న డిమాండ్ పై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటివరకు ఎక్కడా స్పందించలేదు. మరో వైపు చంద్రబాబు కూడా ఈ అంశంపై స్పందించలేదు. కానీ, లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ రోజురోజుకు ఎక్కువవుతుండటంతో చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.


# జగన్ బెయిల్ రద్దు కేసులో కీలక పరిణామం

న్యూఢిల్లీ, జగన్ బెయిల్ రద్దుకు సంబంధించి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జగన్ కేసులను విచారిస్తున్న ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మరోసారి మార్చింది. ప్రస్తుతం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం ఈ కేసులను విచారణ జరుపుతుంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనానికి జగన్ కేసుల ట్రయల్ విచారణను మారింది. 12 ఏళ్లుగా ట్రయల్ అడుగు కూడా ముందుకు కదలలేదని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తరఫు న్యాయవాది వాదించారు. అయితే సీబీఐ తరపు సీనియర్ న్యాయవాది మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున ఈ కేసుకు సంబంధించి వచ్చే వారానికి వాయిదా వేయాలని సీబీఐ తరపు న్యాయవాది కోరడంతో కేసు విచారణను వచ్చే సోమవారం చేపడతామని జస్టిస్ వీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం తేల్చింది. పదేళ్లుగా కేసు విచారణ కొనసాగుతున్నప్పటికి ఒక్క డిశ్చార్జి అప్లికేషన్?కేడా డిస్పోస్? చేయలేదని రఘురామ తరుపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలుపుతూ.. ఈ విషయంలో సీబీఐ, నిందితులు ఇద్దరు కుమ్మక్కయ్యారని అనుమానం వ్యక్తం చేశారు. డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు విన్న ఐదుగురు జడ్జిలు ఎలాంటి నిర్ణయం వెల్లడించకుండానే ట్రాన్సఫర్? అవుతున్నారనని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.



ఇంతవరకు ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్‌పై తుది నిర్ణయం వెలువడకపోవడంతో కుట్రకోణం దాగి ఉందనే సందేహంతో రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని.. సుప్రీం కోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ట్రయల్‌లో జాప్యం జరుగుతూనే ఉందని.. కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు.

# శబరిమల అయ్యప్పస్వామి ఆలయం మూసివేత



శబరిమల, కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హోమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# ప్రియుడి హత్య కేసులో తిరువనంతపురం కోర్టు సంచలన తీర్పు, యువతికి ఉరిశిక్ష!




కేరళ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన హత్య కేసులో యువతికి కోర్టు మరణశిక్ష విధించింది. 2022లో కేరళలో ప్రియుడు శరోన్ రాజ్‌కు విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి హత్య చేసింది గ్రీష్మ. ఈ కేసులో ఇదివరకే విచారణ పూర్తయింది. గ్రీష్మను దోషిగా కోర్టు నిర్ధారించింది. ఈ హత్యలో ఆమెకు సహకరించిన బంధువుకు న్యాయమూర్తి మూడేళ్ల జైలుశిక్ష విధించారు. ఓ వ్యక్తి ప్రాణం తీయడం హేయమైన నేరమని, అంత పెద్ద తప్పు చేసిన శరోన్ రాజ్ ప్రియురాలు గ్రీష్మకు తిరువనంతపురం కోర్టు ఉరిశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

అసలేం జరిగిందంటే..

తిరువనంతపురానికి చెందిన శరోన్ రాజ్ (23) హత్య కేసులో అతడి ప్రియురాలు గ్రీష్మకు కేరళ కోర్టు సోమవారం (జనవరి 20న) మరణశిక్ష విధించింది. బీఎస్సీ రేడియాలజీ చివరి సంవత్సరం విద్యార్థి శరోన్ రాజ్, తమిళనాడులోని కన్యాకుమారికి చెందిన గ్రీష్మ ఓ కాలేజీలో చదువుకునే సమమయంలో ప్రేమలో పడ్డారు. వీరి పరిచయం ప్రేమగా మారి, దాదాపు ఏడాదిపాటు వీరు రిలేషన్ లో ఉన్నారు. ఈ క్రమంలో ఆర్మీలో పనిచేసే వ్యక్తితో 2022లో వివాహం నిశ్చయమైంది. ఈ విషయాన్ని ప్రియుడు శరోన్ రాజ్‌కు చెప్పి, అతడ్ని దూరం పెట్టడం ప్రారంభించింది. పీకల్లోతు ప్రేమలో ఉన్న శరోన్ రాజ్ ఆమె ప్రేమ తనకే దక్కాలని పదేపదే ఆమెకు చెప్పి చూశాడు. మరోవైపు పెళ్లికి సమయం దగ్గర పడుతుండటం, శరోన్ రాజ్ ఏమో తనను వదిలి పెట్టవద్దని గ్రీష్మతో చెబుతూనే ఉన్నాడు.

ప్లాన్ ప్రకారం హత్య

ఎలాగైనా ప్రియుడ్ని వదిలించుకోవాలని చూసిన గ్రీష్మ ఏకంగా అతడ్ని హత్య చేయాలని ప్లాన్ చేసింది. తన మామతో కలిసి ప్రియుడు శరోన్ రాజ్ హత్య చేయాలని భావించింది. అక్టోబర్ 14, 2022న కన్యాకుమారిలోని తన నివాసంలో గ్రీష్మ వద్దకు వెళ్లిన సమయంలో విషం కలిపిన జూస్ ఇవ్వగా శరోన్ రాజ్ తాగాడు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైన అతడు కొన్నిరోజుల్లోనే చనిపోయాడు. అతడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గ్రీష్మ ఫ్యామిలీపై కేసు నమోదైంది. డీవైఎస్పీ జాన్సన్ నేతృత్వంలోని క్రైమ్ బ్రాంచ్ ప్రత్యేక దర్యాప్తు బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. అక్టోబర్ 31, 2022న గ్రీష్మను అరెస్టు చేశారు. ఏడాది పాటు కస్టడీలో ఉన్న గ్రీష్మ, కేరళ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సెప్టెంబర్ 25, 2023న జైలు నుంచి విడుదలైంది. మరోవైపు దర్యాప్తులో గ్రీష్మ, ఆమె మామ కలిసి ఇదంతా చేసినట్లు పోలీసులు గుర్తించి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. విచారణ చేపట్టిననెయ్యట్టింకర అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జనవరి 17న ఇద్దరినీ దోషులుగా తేల్చారు. ఐపీసీ సెక్షన్లు 364, 328, 302 (హత్యకు శిక్ష), 201 సెక్షన్ల కింద కింద గ్రీష్మను దోషిగా తేల్చింది. తన స్వార్థం చూసుకునేందుకు ఓ వ్యక్తిని హత్య చేయడం, సాక్ష్యాధారాలు మాయం చేసి పోలీసులను తప్పుదోవ పట్టించడం లాంటి విషయాలను కోర్టు తీవ్రంగా పరిగణించి తీర్పు వెలువరించింది. ఈ కేసులో గ్రీష్మ తల్లికి సంబంధం ఉందని బాధిత కుటుంబం ఆరోపించింది. కానీ అందుకు సాక్ష్యాలు లభ్యంకాకపోవడంతో ఆమెను నిర్దోషిగా కోర్టు తేల్చింది.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుతపులి కలకలం

రాజన్న సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత సంచారంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తాఫానగర్ గ్రామ శివారులో రాసమల్ల రాజు అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది.

అయితే పొలంలోనే పశువుల కోసం ఓ షెడ్‌ను నిర్మించాడు. అందులో బర్రెను కట్టేసి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఇక సోమవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా, బర్రె రక్తపు మడుగులో పడి ఉంది. ఆందోళనకు గురైన రాజు.. గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. ఇక అతని పొలంలో పులి పాదముద్రలను గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను అధికారులు నిర్ధారించారు. అనంతరం రైతులను, స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత కదలికలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కోసం పక్కా వ్యూహం?

అమరావతి,సీఐడీ మాజీ చీఫ్ సునీల్ అవినీతికి పాల్పడ్డారంటూ ప్రభుత్వం మరో కేసును తెరపైకి తెచ్చింది. పోలీసు హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టరుగా ఉండగా, డ్యాష్ బోర్డు తయారుచేసేందుకు టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా మూడు కోట్ల రూపాయలు చెల్లించారని ఆరోపిస్తూ మరో అభియోగం నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆయన సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిస్తూ విచారణకు ఆదేశించింది. తాజాగా అవినీతికి పాల్పడ్డారంటూ మరో అంశాన్ని వెలుగులోకి తేవడం ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ సునీల్ కుమారును విడిచిపెట్టే ప్రసక్తే లేదని సంకేతాలు పంపినట్లైంది.డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమారుకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లభించకపోవడంతో ప్రభుత్వం ప్లాన్ బీ అమలు చేయాలని చూస్తోంది. గత ప్రభుత్వంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురిచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ కుమారుపై ఎలాగైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పంతం పట్టిందని అంటున్నారు. కార్యకర్తలు, నాయకుల నుంచి విపరీతమైన ఒత్తిడి ఉండటం, రఘురామ కేసులో ఆయనకు వ్యతిరేకంగా ఆధారాలు లభించకపోవడంతో కొత్త కేసులు తెరమీదకు తెస్తోందని అంటున్నారు. దీంతో గత ప్రభుత్వంలో సునీల్ కుమారు జరిపిన ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తోంది.ప్రస్తుతం వీఆర్ లో ఉన్న సునీల్ కుమారుపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉంది. గత ప్రభుత్వంలో అప్పటి వైసీపీ పెద్దలు చెప్పినట్లు చేశారని అభియోగాలు ఎదుర్కొంటున్న సునీల్ కుమార్ ను తేలిగ్గా వదలొద్దని కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆయనకు వ్యతిరేకంగా బలమైన కేసులు పెట్టేలా వ్యూహం రచిస్తోంది. రఘురామ కేసు ఒకవైపు విచారణలో ఉండగానే, అవినీతి వ్యవహారాలను తవ్వితీస్తోంది. ఇందులో భాగంగా గతంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, వైస్ చైర్మనుగా పనిచేసిన సునీల్ కుమార్ ఆ శాఖకు డాష్ బోర్డు తయారు చేయించాలని నిర్ణయించారు. ఇందుకోసం 2019 జనవరి 30న ఈ టెండర్లను ఆహ్వానించారు. అయితే ఈ టెండర్ల ఖరారులో నిబంధనలు పాటించలేదని తాజాగా ప్రభుత్వం గుర్తించింది.ఒక టెండర్ ఖరారు కావాలంటే మూడు దరఖాస్తులు కచ్చితంగా రావాల్సివుంటుంది. అయితే పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డ్యాష్ బోర్డు తయారీ కోసం కేవలం రెండు సంస్థలే దరఖాస్తు చేసుకున్నాయి. నిబంధనల ప్రకారం మరోమారు టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాల్సివుండగా, ఎండీ హోదాలో సునీల్ కుమార్ తుది నిర్ణయం తీసుకున్నారని ప్రభుత్వం చెబుతోంది. డ్యాష్ బోర్డు తయారీ కోసం మెగట్రాన్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, వీఎస్ఎన్ ఇన్ఫో ప్రైవేటు లిమిటెడ్ దరఖాస్తు చేయగా, రెండో దానికి అర్హత లేదని ఆ దరఖాస్తును తోసిపుచ్చారు. దీంతో మెగట్రాన్ ఐటీ సర్వీసెస్ కు టెండర్ అప్పగించారు. ఈ సంస్థ రఘురామ కేసులో అరెస్టు అయిన కామినేని తులసిబాబుదిగా చెబుతున్నారు. తన అనుచరుడు కోసం సునీల్ కుమార్ టెండర్ నిబంధనలు పాటించలేదని ప్రభుత్వ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా డ్యాష్ బోర్డు తయారు చేయకుండానే రూ.3 కోట్లు చెల్లించారని చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారంలో సునీల్ కుమార్ పై చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని అంటున్నారు.



## అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

హైదరాబాద్, అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com